
సాక్షి
గుంటూరు
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



బండ్లమ్మ సేవలో జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖ అమ్మవారి దేవాలయంలో బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి సాధుబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,152 క్యూసెక్కులు వదిలారు.

బండ్లమ్మకు పూజలు



పిట్టలవానిపాలెం : చందోలులోని బగళాముఖ బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం ఆఖరి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శ్రావణ మంగళ మహాగౌరీగా, అభయ ప్రదాయినిగా అలంకరించి అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

ఆర్గానిక్ ఫామ్ నుంచి నాణ్యమైన ఉత్పత్తులు



నరసరావుపేట: అత్తలూరు ఆర్గానిక్ ఫామ్ నుంచి మరిన్ని నాణ్యమైన ఉత్పత్తులను అందించేలా కృషిచేస్తామని ఎండీ సురేంద్రబాబు హామీ ఇచ్చారు. అత్తలూరు ఆర్గానిక్ ఫామ్‌కు జైవిక్ ఇండియా–2023 అవార్డు వచ్చిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను సంఘ రైతులతో కలిసి ఎండీ మర్యాదపూర్వకంగా కలిశారు. సేంద్రియ సాగు ద్వారా పండించిన ఉత్పత్తుల ఎగుమతులకు అవార్డు వచ్చేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్‌తోపాటు ఉద్యానవనశాఖ బీజే బెన్నీకి కృతజ్ఞతలు తెలిపారు.

16న జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి మంగళవారం తెలిపారు. జిల్లా పరిధిలోని 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ, యువకులు ఈపోటీలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. సాంస్కృతిక విభాగంలో ఫోక్ డాన్స్ (గ్రూప్, సోలో), ఫోక్ సాంగ్ (గ్రూప్, సోలో), లైఫ్ స్కిల్ విభాగంలో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫోటోగ్రఫీ, జస్ట్ ఏ మినిట్ పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రదర్శన సామగ్రిని ఎవరికి వారే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులవుతారని వెల్లడించారు.

జీఎంసీ కమిషనర్‌కు కలెక్టర్ అభినందనలు



గుంటూరు వెస్ట్: జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరిని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కమిషనర్ కీర్తి చేకూరి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు కార్పొరేషన్‌కు మూడో ర్యాంకు, పురస్కారం వచ్చిన సందర్భంగా కమిషనర్ కీర్తి చేకూరి కలెక్టర్‌ను కలిసి వివరాలను వెల్లడించారు. అవార్డును కలెక్టర్‌కు చూపించారు.

14న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని భవిష్యనిధి (పీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఓప్రకటనలో తెలిపాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలోని భవిష్యనిధి పెన్షనర్లు తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు నేరుగా పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని సూచించాయి. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఈ–మెయిల్, వాట్సప్ ద్వారా ఈనెల 14న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగే పెన్షన్ అదాలత్‌కు పంపాల్సిందిగా అధికారులు కోరారు. కార్యాలయ పనిదినాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్ ద్వారాను తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు, సమస్యలను సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెబ్ ఎక్స్ ఐడీ ద్వారా కూడా పంపవచ్చని, పెన్షన్ దారులు ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని వివరించారు. ఆర్వో.గుంటూరుఎట్‌దరేట్‌ఈపీఎఫ్ఇండియా.జీవోవీ.ఇన్ మెయిల్‌తో పాటు 0863–2344106, 2232921 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. వెబ్‌ఎక్స్ ఐడీ 26442506930, పాస్‌కోడ్ ఈపీఎఫ్ఓ ఎట్‌దరేట్ 1234కు లాగిన్ కావాలని పేర్కొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 5,527 క్యూసెక్కుల విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 260, బ్యాంక్ కెనాల్‌కు 1,513, తూర్పు కెనాల్‌కు 540, పశ్చిమ కెనాల్‌కు 151, నిజాంపట్నం కాలువకు 306, కొమ్మమూరు కాల్వకు 2,440 క్యూసెక్కులు విడుదల చేశారు.

విరభూసిన నవ్వులు




ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇతని పేరు జొన్నలగడ్డ శ్రీనివాస రావు. వయస్సు 53 ఏళ్లు. 1980లో ఇతని పూర్వీకులకు ప్రత్తిపాడు మండలం కొండజాగర్లమూడి రెవెన్యూ గ్రామంలోని 21–1 సర్వే నంబరులో 0.49 సెంట్ల భూమిని ప్రభుత్వం ఇచ్చింది. దీనిలో వ్యవసాయం చేసుకుంటూ శ్రీనివాసరావు కుటుంబం జీవిస్తోంది. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన చిన్నపాటి ఇంట్లోనే నివాసం. పూర్వీకుల నుంచి వచ్చిన భూమి ప్రభుత్వ భూముల జాబితాలో ఉండడంతో అతనికి ఏ హక్కూ లేకుండా పోయింది. భూమిపై రుణం పొందాలన్నా సాధ్యం కాని స్థితి. ఫలితంగా ఆర్థిక పరిస్థితి సరిపోక కొడుకు చదువును డిగ్రీతో సరిపెట్టాల్సి వచ్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 22–ఏ జాబితా నుంచి భూమిని తొలగించాలని నిర్ణయం తీసుకోవడంతో శ్రీనివాస రావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా భూమిపై హక్కుల్లేక సతమతమవుతున్నామని, సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషంగా చెబుతున్నారు.

- నిషేధిత జాబితా నుంచి భూములకు మోక్షం
- జిల్లాలో 2,339.15 ఎకరాలకు విముక్తి
- సాగుదారులకే హక్కులు
- వేలాది కుటుంబాలకు ప్రయోజనం



గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఫైల్)



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గత కొన్ని దశాబ్దాలుగా నిషేధిత భూముల జాబితాలో ఉన్న వేలాది ఎకరాలకు ప్రభుత్వ నిర్ణయంతో మోక్షం కలిగింది. గుంటూరు జిల్లాలో చుక్కల భూములు, వివిధ విభాగాల్లోని 22ఏ భూములు మొత్తం 2,339.15 ఎకరాలను నిషేధిత భూముల జాబితా నుంచి అధికారులు తొలగించారు. ఇందులో చుక్కల భూ ముల జాబితా నుంచి 169 సర్వే నంబర్లకు సంబంధించి 601.36 ఎకరాలు, 22ఏలోని వివిధ కేటగిరిల నుంచి 870 సర్వే నంబర్లకు సంబంధించి 1737.79 ఎకరాలు ఉన్నాయి. ఫలితంగా వేలాది కుటుంబాలకు మేలు జరిగింది.

రీ క్లాసిఫికేషన్ చేసి మరీ..

జిల్లాలోని 208 గ్రామాల్లో 3,587 సర్వే నంబర్లలో 5,415.79 ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి. గత ప్రభుత్వ ఉత్తర్వులతో ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే అవకాశం లేకుండా పోయింది. దీంతో వీటిని పూర్తిగా విచారణ చేసి రీ–క్లాసిఫికేషన్ చేశారు. మిగిలిన వాటిలో తక్షణం 1,737.79 ఎకరాల భూమిని యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపింది. దీనికి సంబంధించి జీఓ నంబర్ 89 విడుదల చేసిన సంగతి తెలిసిందే. మిగతా భూముల్లో 22ఏ(1)ఏ కింద 1,160 సర్వే నంబర్లలో 1587.77 ఎకరాలు, బీ కేటగిరి కింద 1,477 సర్వే నంబర్లలో 1,768.88 ఎకరాలు, సీ కేటగిరి కింద నాలుగు సర్వే నంబర్లలో 9.88 ఎకరాలు, డీ కింద 123 సర్వే నంబర్లలో 283.82 ఎకరాలు ఉంచారు. ఇవి కాకుండా జిల్లాలో 22ఏ1ఈ (చుక్కల భూములు) జాబితాలో 455 సర్వే నంబర్లలో 1,338 ఎకరాలు ఉంది. వాటిని పరిశీలించిన తర్వాత అందులో 583 ఎకరాలను 22ఏ1ఏ కింద, 154 ఎకరాలను 22ఏ1బీ కిందకు మార్చారు. 169 సర్వే నంబర్లలోని 601.36 ఎకరాల భూమిని 22ఏ నుంచి తొలగించారు. వీటి విలువ 803.33 కోట్లుగా అంచనా. ఈ నిర్ణయం వల్ల 2,650 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఈ కేటగిరి కింద 18 సర్వే నంబర్లలో 27.15 ఎకరాలు మాత్రం(తుళ్లూరు మండలంలో) ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో ఇంత భారీ స్థాయిలో నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు జరగలేదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిషేధిత భూములు అంటే..

ప్రభుత్వ భూములను ఆయా సర్వే నంబర్లను అనుసరించి 22ఏ, బీ, సీ, డీతోపాటు 'ఈ' జాబితాలో నమోదు చేస్తారు. మన ఆస్తి పైజాబితాలో ఉంటే వాటిని రిజిస్ట్రేషన్ చేయరు. వీటిని తొలగించాలంటే వీఆర్‌ఓ నుంచి తహసీల్దార్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ నుంచి నివేదిక సీసీఎల్ఏకి వెళ్లి అక్కడి నుంచి రెవెన్యూ కార్యదర్శి నుంచి క్యాబినెట్ సమావేశంలో ఆమోదం పొంది జీఓ విడుదల కావాలి. ఈ ప్రక్రియ గతంలో దాదాపుగా జరగని పరిస్థితి ఉంది.

22ఏ రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారం ఇందులో ఐదు సబ్ క్లాజ్‌లు ఉన్నాయి. అవి

- 22ఏ1(ఏ) అంటే పేదలకు అసైన్ చేసిన భూములు
- 22ఏ(1)బీ అంటే పూర్తిగా ప్రభుత్వ భూములు (వాగు వంకలు, శ్మశానాలు, గ్రామ కంఠాలు)
- 22ఏ(1)సీ అంటే దేవదాయ శాఖ, వక్ఫ్ భూములు
- 22ఏ(1)డీ అంటే అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు
- 22ఏ(1)ఈ అంటే అది ప్రభుత్వ భూమా? ప్రైవేటు భూమి అన్నది నిర్ధారణ కానివి (చుక్కల, ఆర్ అండ్ ఆర్, ప్రభుత్వ ఆటాచ్‌మెంట్‌లో ఉన్నవి)

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఇబ్బంది

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల ఎకరాలు భూములను అసైన్డ్ జాబితాలో చేర్చింది. ముఖ్యంగా 2016లో 197 జీఓ ద్వారా రైతులతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కూడా తీవ్ర నష్టం కలిగించింది. అప్పట్లో కొన్ని వందల కోర్టు కేసులు నమోదయ్యాయి. అధికారులకు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోనుంది. క్రయవిక్రయాలూ జోరందుకోనున్నాయి.

జిల్లా అధికార యంత్రాంగం చొరవతో..

ఈ మొత్తం ప్రక్రియలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు చొరవ తీసుకుని ముందుగా జిల్లాలోని నిషేధిత భూములను పరిశీలించి వాటిపై అభ్యంతరాలు, విజ్ఞప్తులను ప్రత్యేక అధికారులతో పర్యవేక్షించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను తెలుసుకుని అవకాశం ఉన్న అన్ని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు.

ప్రతి భూ సమస్యకూ పరిష్కారం



ప్రభుత్వ ఆదేశాలతో భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాం. అర్హులైన రైతులకు సర్వహక్కులూ అందించే చర్యలు చేపట్టాం. హక్కులు పొందిన వారు ఇప్పుడు తమ భూమిని విక్రయించుకోవచ్చు. పిల్లల పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. భూ సమస్యలపై ఏ ఒక్కరూ అధికారులు చుట్టూ తిరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీవో 89 ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. తాజా జాబితాలను అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపాం. మా వద్దకు వచ్చిన ప్రతి భూ సమస్యకూ పరిష్కారం చూపే యత్నం చేస్తాం.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్, గుంటూరు

9 మంది బాల కార్మికుల గుర్తింపు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆపరేషన్ స్వేచ్ఛ–3లో భాగంగా పోలీస్, కార్మిక, మహిళా/ శిశు సంక్షేమ శాఖలతోపాటు బచ్పన్ బచావో ఆందోళన, క్రాప్ ఆర్గనైజేషన్లు సంయుక్తంగా మంగళవారం గుంటూరు నగరంలోని పలు దుకాణాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాయి. వాటర్ ప్లాంట్స్, చికెన్ సెంటర్లు, మెకానిక్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ డ్రైవ్‌లో అధికారులు తొమ్మిది మంది బాల కార్మికులను గుర్తించి, సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచారు. అనంతరం సీబీడీ గుంటూరు రీజినల్ ఎస్పీ కేజీవీ సరిత చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. తద్వారా భవిష్యత్‌లో వివిధ రంగాల్లో ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కౌన్సెలింగ్ చేపట్టారు.

18 నుంచి దుర్గమ్మ సన్నిధిలో చవితి వేడుకలు

విజయవాడ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో 18 నుంచి 20వ తేదీ వరకు వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తామని ఈఓ భ్రమరాంబ మంగళవారం తెలిపారు. శ్రీ నటరాజ స్వామి ఆలయం ప్రాంగణంలోని వినాయక ఆలయం, చిన్న రాజగోపురం ఎదుట లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద మృత్తిక గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 18న ఉదయం ఎనిమిది గంటలకు విఘ్నేశ్వర పూజ, అనంతరం కలశ స్థాపన, విశేష పత్రి పూజ, చవితి కథా శ్రవణం జరుగుతాయని వెల్లడించారు. 19వ తేదీ ఉదయం గణపతి పూజ, గణపతి హోమం, 20వ తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం గణపతి నిమజ్జనం జరుగుతాయని వివరించారు.

ఔషధ దుకాణాలపై దాడులు

నరసరావుపేట టౌన్: ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మంగళవారం పట్టణంలోని పలు ఔషధ దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న 50 రకాల ఫిజీషియన్ శ్యాంపిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్ తెలిపారు. అందిన ముందస్తు సమాచారం మేరకు మేదర బజార్‌లోని మెడికల్ గోదాంను పరిశీలించారు. తనిఖీల్లో అనుమతులు లేకుండా గోదాంను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. గోదాం లోపల సుమారు 40 నుంచి 50 రకాలు ఫిజీషియన్ శ్యాంపిళ్లు, మాత్రలు అక్రమంగా ఉండటాన్ని గుర్తించి వాటిని సీజ్ చేశారు. గోదాం సాతులూరి కోటేశ్వరరావుదిగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే కోట సెంటర్‌లోని ప్రవల్లిక మెడిసిన్స్‌లో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మందుల కొనుగోలు, అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు. విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే నివేదికను ఉన్నతాధికారులకు పంపించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు మహేష్, పద్మ, విజయలక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఔషధాల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న అధికారులు

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరంలాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

వివా
ది స్కూల్ బై వీవీఐటీ, నంబూరు
గుంటూరు జిల్లా
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015

District sponsor

విజ్ఞానమస్తు



చిన్నారులకు అర్థమయ్యేలా వివరించే బోధనాకృతులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయినులు

ఓం 'ప్రథమ్'

- విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి
- పునాది తరగతుల్లో ప్రత్యేక బోధనకు చర్యలు
- ఎఫ్ఎల్ఎన్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ



పాఠ్యాంశాల బోధనాకృతులను చూపిస్తున్న ఉపాధ్యాయులు

బాపట్ల అర్బన్: శ్రద్ధగా వినడం.. చక్కగా చదవడం.. అందంగా రాయడం.. సరళంగా మాట్లాడడం.. ప్రాథమిక భావనలను అర్థంచేసుకోవడం.. వంటి విద్యాభ్యాసన, భాషా సామర్థ్యాలను చిన్నారుల్లో పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యా ప్రణాళికలు అమలు చేస్తోంది. చిన్న వయసులోనే గట్టిపునాది వేసేలా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలోభాగంగా సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌పర్మేషన్ (సాల్ట్) అమలుకు పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

మండలానికి ముగ్గురు ఉపాధ్యాయుల ఎంపిక

ప్రథమ్ సంస్థ ద్వారా మండలానికి ముగ్గురు టీచర్ల చొప్పున మొత్తం 75 మందిని జిల్లా రిసోర్స్‌పర్సన్లుగా (డీఆర్పీలు)గా ఎంపిక చేసి అధికారులు శిక్షణ పూర్తిచేశారు. డీఆర్పీలు త్వరలో మండలాలకు వెళ్లి ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తారు.

జ్ఞాన జ్యోతి.. జ్ఞాన ప్రకాష్‌గా విభజన

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్య (1, 2 తరగతులు)ను జ్ఞానప్రకాష్‌గా విభజించారు. జ్ఞానజ్యోతి విభాగంలో అంగన్‌వాడీ టీచర్లకు 120 రోజులు, జ్ఞాన ప్రకాష్ విభాగంలోని ఎస్‌జీటీలకు 60 రోజుల శిక్షణ ఉంటుంది. ఏడాదికి 20 రోజుల వంతున మూడేళ్లపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. 20 రోజులలో తొలి ఆరు రోజులు ఆఫ్‌లైన్, మిగిలిన 14 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ప్రాథమిక విద్యకు సంబంధించిన జ్ఞాన ప్రకాష్ బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు తర్ఫీదు పూర్తిచేశారు.

కొత్త విద్యావిధానంలో భాగంగా..

నూతన విద్యావిధానం–2020లో భాగంగా కేంద్రప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ –1లో 3 నుంచి 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ –2లో 4 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను ఖచ్చితంగా కలిగి ఉండాలనేది ఎఫ్ఎల్ఎన్ ముఖ్య ఉద్దేశం.

ఎల్ఎఫ్ఎన్ ప్రయోజనాలివీ..

- విద్యాభ్యాసన సామర్థ్యాలు పెరుగుతాయి
- తెలుగు, గణితం వంటి సబ్జెక్టుల్లో పునాది గట్టిగా ఉంటుంది.
- మూడో తరగతికి వచ్చేసరికి విద్యార్థికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం వంటి సామర్థ్యాలు పెరుగుతాయి.
- గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారాల్లో ప్రతివిద్యార్థి నైపుణ్యం సాధించేలా టీచర్లు తీర్చిదిద్దుతారు.

బోధనా సామర్థ్యాల పెంపే లక్ష్యం

ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తోంది. దీనికోసం మండలానికి ముగ్గురు వంతున ఉపాధ్యాయులను డీఆర్పీలుగా ఎంపిక చేసి వారికి ఇటీవల శిక్షణ ఇచ్చాం. త్వరలో వీరంతా మండలాలకు వెళ్లి ఎస్‌జీటీలకు శిక్షణ ఇస్తారు.

– పి.వి.జె.రామారావు, బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

ఇంజినీరింగ్ విద్యార్థినిపై సిరంజితో దాడి

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఇంజినీరింగ్ విద్యార్థినిని వెంటపడి వేధించి సిరంజితో దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలానికి చెందిన యువతి గుంటూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతూ లేడీస్ హాస్టల్‌లో ఉంటుంది. క్రోసూరు మండలం పెరికపాడు తండాకు చెందిన నాగబాలాజీ నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తుంటాడు. బాలాజీ ఇంజినీరింగ్ విద్యార్థినితో పరిచయం పెంచుకున్నాడు. అనంతరం తనకు లొంగాలంటూ వెంటపడి వేధించాడు. మంగళవారం ఇంజినిరింగ్ విద్యార్థిని అరండల్‌పేట 10వ లైనులో నడిచి వెళుతున్న సమయంలో వెనుకగా వచ్చిన బాలాజీ సిరంజితో ఆమెపై దాడిచేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమెను జీజీహెచ్‌కు పంపించి చికిత్స చేయిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగబాలాజీ పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జూనియర్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

పెనమలూరు: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నైన్ ఏ సైడ్ ఫుట్‌బాల్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక మండలంలోని ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో మంగళవారం ఉత్సాహంగా సాగింది. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్రస్థాయి జూనియర్ నైన్ ఏ సైడ్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జట్లకు ఉత్తమ ఆటతీరు కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు.

ప్రజా పంపిణీ బలోపేతం కావాలి

జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో కేంద్రం నుంచి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్ అండ్ స్టడీస్ సంస్థ జిల్లాలోని 5 రేషన్ దుకాణాలను, ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేసిందన్నారు. వారు సంతృప్తి వ్యక్తం చేయడం అభినందనీయమని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై స్పందనలో వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు లోపాలను సరిచేసుకుంటూ ముందుకెళ్లాలని జేసీ చెప్పారు. సమావేశంలో డీఎస్ఓ కోమలి పద్మ, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

పొన్నూరులో 10.8 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో గుంటూరు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 10.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 1 మి.మీ వర్షం పడింది. సగటున 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను 9.6, కొల్లిపర 8.6, దుగ్గిరాల 7.8, పెదనందిపాడు 6.4, పెదకాకాని 3.4, వట్టిచెరుకూరు 2.2, గుంటూరు పశ్చిమ 2, మంగళగిరి 2, తాడికొండ 1.8, తుళ్ళూరు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 12వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 56.2 మి.మీ ఉండగా, ఇప్పటి వరకు 164.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

డీలర్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రామాంజనేయులు

గుంటూరు రూరల్: పురుగు మందులు, ఎరువులు, విత్తనాల డీలర్స్ అన్ని రకాల సాంకేతికత పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని ఆత్మ పథకం సంచాలకుడు పి.రామాంజనేయులు తెలిపారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలోని కృషి భవన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన వ్యాపారులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 మందితో రెండవ బ్యాచ్‌కు శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్ వేణుకృష్ణ, టి.వెంకటేశ్వర్లు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు నగరాభివృద్ధికి కృషి

- రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి
- తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం


శంకుస్థాపన శిలాఫలకం వద్ద ఎంపీ అయోధ్యరామిరెడ్డి, మేయర్ కావటి, జిల్లా అధ్యక్షుడు డొక్కా, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ మర్రి, కమిషనర్ కీర్తి తదితరులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మంగళవారం ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, కమిషనర్ కీర్తి చేకూరిలతో కలిసి సంగడిగుంట, ఏటుకూరు రోడ్డు, కబాడీ గూడెంలో రూ 3.53 కోట్ల అంచనా వ్యయంతో సీసీ డ్రైయిన్‌లు, రూ 1.60 కోట్ల అంచనా వ్యయంతో పొన్నూరు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలక వర్గం వచ్చిన తరువాత గుంటూరు నగరాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు జరిగాయన్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలకవర్గం, అధికార యంత్రాంగం పాటుపడుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలోనే గుంటూరు నగరం రోల్‌మోడల్‌గా రూపుదిద్దుకుంటోందన్నారు. దీనికి నిలువెత్తు నిదర్శనం ఇటీవల జాతీయ స్థాయిలో స్వచ్ఛవాయు సర్వేక్షణ్ అవార్డు రావడమేనన్నారు. ముఖ్యంగా వెనుకబడ్డ ప్రాంతాలు, శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ఏటుకూరు రోడ్డు బృందావన్ అపార్ట్‌మెంట్, సంగడిగుంట ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా చిన్నపాటి వర్షాలకే డ్రైయిన్లు పొంగి పొర్లేవని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ఇబ్బందులు పరిష్కరించేందుకు రూ 3.53 కోట్లతో సీసీ డ్రైయిన్లు నిర్మించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు మూడు వందల కోట్లకు పైగా అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ ఏర్పడిన తరువాత చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధి పాలకవర్గ ఏర్పాటు కాక ముందు.. అయిన తరువాత చూసుకుంటే... బహుశా రాష్ట్రంలో నగరమే మొదటి స్థానంలో ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పాలకవర్గం సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో శివారు ప్రాంతాలతో సహా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రెయిన్ ఏర్పాటుకు నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు గుర్తించిన ప్రాంతాల్లో అధిక ప్రాధాన్యత కల్పించి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు షేక్ సజీల, వనమా బాలవజ్రబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, నేతలు షేక్ గులాం రసూల్, కార్పొరేటర్‌లు, ఆయా డివిజన్‌ల అధ్యక్షులు, అధికారులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పాల్గొన్నారు.

బయోస్టిమ్ లెంట్స్ తయారీ గోదాములో విజిలెన్స్ తనిఖీలు

కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా బయో స్టిమ్ లెంట్స్ తయారు చేస్తున్న గోదాములో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ప్రభుత్వ అనుమతులు లేని రూ.3.78 లక్షల విలువ గల బయో స్టిమ్ లెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు యాజలిలోని బయో స్టిమ్‌లెంట్స్ తయారు చేస్తున్న గోదాములో విస్తృత తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ అనుమతులు లేకుండా బయో స్టిమ్ లెంట్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు.

బయో స్టిమ్ లెంట్స్ తయారు చేస్తున్న ఇక్కుర్తి గోపాలకృష్ణను విజిలెన్స్ అధికారులు ప్రశ్నించగా తనకు స్టిమ్ లెంట్స్ తయా రు చేయటం వచ్చునని ముడి పదార్థాలు తీసుకువచ్చి తయారు చేసి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. చట్ట నిబంధన ప్రకారం తయారీకి ఉపయోగించే ముడి సరుకులను, ఇప్పటికి తయారు చేసి ఉన్న వాటిని, ప్యాకింగ్ యంత్రాలను సీజ్ చేసి అతని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దాడులలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ జె.వాసంతి, బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ దివ్యాంగుల క్రికెట్ జట్టు కోచ్‌గా నందం సాయి


నందం సాయి


ఎన్ సాయికృష్ణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రికెట్ జట్టు కోచ్‌గా మండల పరిధిలోని మండెపూడి గ్రామానికి చెందిన నందం సాయిని ఎంపిక చేశారు. గత నెల 25న కృష్ణా జిల్లా మూలపాడు ఏసీఏ మైదానంలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో ఎంపిక చేసిన జట్టుకు కోచ్‌గా నందం సాయిని సోమవారం ప్రకటించారు. ఎంపికైన జట్టు డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సనాతన సేవా సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయ్‌పూర్‌లో ఈనెల 28 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి దివ్యాంగుల టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొంటుంది. ఈసందర్భంగా నందం సాయి మాట్లాడుతూ తనను కోచ్‌గా నియామకానికి సహకరించిన ఆంధ్రా దివ్యాంగుల క్రికెట్ ఫెడరేషన్ చైర్మన్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సంస్థ కార్యదర్శి వై.సూర్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జట్టు విజయానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు

జట్టు సభ్యుడిగా ఎన్.సాయికృష్ణ

ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల క్రికెట్ జట్టు సభ్యుడిగా గుంటూరుకు చెందిన ఎస్.సాయికృష్ణ ఎంపికయ్యారు. జట్టులో ఎంపికైన 14 మంది సభ్యులలో ఒకడిగా సాయికృష్ణను ఎంపికచేశారు.

రీ వెరిఫికేషన్‌లో లోపాలు తలెత్తనివ్వద్దు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఓటర్ల జాబితా రీ వెరిఫికేషన్‌లో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకూడదని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ వ్యక్తి కూడా ఓటు లేకుండా ఉండకూడదన్నారు. నూతన ఓటర్లకు సంబంధించి ఫాం-6, 7, క్లెయిమ్స్‌కు సంబంధించి ఫాం-8 పెండింగ్ లేకుండా వెరిఫికేషన్ చేయాలన్నారు. ఇంటింటి ఓటు సర్వేలో భాగంగా బీఎల్వోలు నిర్వహించే కార్యక్రమాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బీఎల్వోలు కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని చెప్పారు. రాజకీయ పార్టీల విలువైన సూచనలు స్వీకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందులను ఎప్పటికప్పుడు వివరించాలని తెలిపారు.

14 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి వేణుగోపాల్

నరసరావుపేటరూరల్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ఈనెల 14నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ మండల, నియోజకవర్గ కోఆర్డినేటర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు, 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించాలన్నారు. మండల, నియోజకవర్గ కోఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేసి పోటీలను విజయవంతం చేయాలని తెలిపారు. ఎంపిక పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారుల ఎంపికలతో జిల్లా జట్లను సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడానికే జగనన్న సురక్ష

వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ దిశానిర్దేశం

గుంటూరు మెడికల్: పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు, స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు వైద్యులు, వైద్య సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలతో జరిగిన జూమ్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ మొదటి దశలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు హెచ్‌పీ, బీపీ, మలేరియా, డెంగ్యూ, ఆర్‌బీఎస్ లాంటి వైద్య పరీక్షలు చేయాలన్నారు.
ఏదైనా ఆరోగ్య సమస్యల ఉన్న వారికి తక్షణమే అక్కడే చికిత్స అందించాలన్నారు. దీర్ఘకాలిక రుగ్మతలు, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని రెండవ దశలో నిర్వహించే మెడికల్ క్యాంపులకు రిఫర్ చేయాలని చెప్పారు. మెడికల్ క్యాంపులలో ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, ఇద్దరూ వైద్యాధికారులు సేవలందిస్తారన్నారు. వైద్య శిబిరాలకు హాజరైన వారిలో, తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్న వారిని అవసరాన్ని బట్టి గుంటూరు జీజీహెచ్, తెనాలి జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్. చుక్కా రత్న మన్మోహన్, డాక్టర్ శివ గోపాల్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్ పాల్గొన్నారు.

యార్డుకు 31,804 బస్తాల మిర్చి

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 31,804 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30.618 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,200 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,800 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,664 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

25న తపాలా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

లక్ష్మీపురం: గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల కోసం కమీషన్ పద్ధతిలో ఏజెంట్లుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డివిజన్ సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదవ తరగతి, ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవల్సిందిగా తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25న చంద్రమౌళి నగర్ పోస్టాఫీస్ ప్రాంగణంలో ఉన్న సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ గుంటూరు డివిజన్‌కు ఉదయం 11 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావల్సిందిగా తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు ఖచ్చితంగా బయోడేటా, ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. నియమించబడిన అభ్యర్థులకు రూ.5 వేల రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్‌గా 5 సంవత్సరాల నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ రూపంలో పూచీకత్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.5 వేల రూపాయలు ఏజెన్సీ రద్దు చేసుకునే సమయంలో జాతీయ పొదుపు పథకం వడ్డీ రేటుతో సహా తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 0863-2255978, 2255078లను సంప్రదించాల్సిందిగా తెలియజేశారు.

23కు ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో మంగళవారం జరగాల్సిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు 23వ తేదీ నిర్వహిస్తామని, అభ్యర్థులు గమనించాలన్నారు.

పల్నాడులో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

నరసరావుపేటరూరల్: హిందీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న హిందీ భాషా ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. నరసరావుపేట డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాలరావు పోటీలను ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలలో జిల్లాలోని 15మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, 75 తాళ్లూరు పాఠశాల, వి.రెడ్డిపాలెం పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని సాధించారు. విజేతలైన విద్యార్థులకు ఈనెల 14వ తేదీన నిర్వహించే హిందీ దివస్ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదగా బహుమతులు అందజేస్తారని తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


ప్లాట్‌ఫాం పట్టాల మధ్య ఉన్న మృతదేహం

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల జిల్లా పల్లెకోన స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి పల్లెకోన స్టేషన్‌లో రేపల్లె ప్యాసింజరు నుంచి జారి ప్లాట్‌ఫాం, పట్టాల మధ్యలో పడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.


ప్రతి జిల్లాలోనూ మెడికల్ కళాశాల గర్వకారణం

న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ విజయ


అవార్డుతో డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఉండటం గర్వంగా ఉందని న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. న్యూఢిల్లీలో గ్లోబల్ స్ట్రోక్ అలయన్స్ కాన్ఫరెన్స్ ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగింది. ఆగ్నేసియా దేశాలైన భూటాన్, మయన్మార్, మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా, నేపాల్ దేశాలతోపాటు, ఆఫ్రికా, యూరప్, అమెరికా ఖండాల నుంచి పలువురు న్యూరాలజిస్టులు పాల్గొన్నారు. మన రాష్ట్రం నుంచి డాక్టర్ విజయ కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా సీటీ స్కాన్ వైద్య పరికరం అందుబాటులో ఉందని చెప్పారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో ప్రైమరీ స్ట్రోక్ సెంటర్‌లను అనుసంధానం చేస్తే పక్షవాత రోగులకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రాశ్చాత్య దేశాల్లో 91 శాతం స్ట్రోక్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, అభివృద్ధి చెందుతున్న భారత దేశం లాంటి దేశాల్లో 18 శాతం మాత్రమే స్ట్రోక్ యూనిట్లు ఉన్నట్లు వెల్లడించారు. పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్) వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స ఏ విధంగా అందించాలి, కృత్రిమ మేధతో, రోబోటిక్స్ సాయంతో స్ట్రోక్ చికిత్సలు ఏవిధంగా చేయవచ్చు అనే అంశాలపై రూపొందించిన గ్లోబల్ డిక్లరేషన్‌ను ప్రతినిధులంతా ఆమోదించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డి.తస్కిన్‌ఖాన్ మాట్లాడుతూ గుండె, మెదడు, రక్తనాళాల సంబంధిత వ్యాధుల మరణాలు, వాటి ద్వారా సంభవించే వైకల్యాన్ని నివారించేందుకు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. పక్షవాతం రోగులకు అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలకు గాను లలితా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు డైమాండ్ అవార్డు లభించింది. అవార్డు అందుకున్న డాక్టర్ విజయకు సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.వి.రాఘవశర్మ, పలువురు న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు, ఐఏఎం నేతలు అభినందనలు తెలిపారు.

పెరుగు కోసం వెళ్లి.. మృత్యుఒడికి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జోగిరాజు

ప్రత్తిపాడు: పెరుగు ప్యాకెట్ కోసం వెళ్లిన వలస కూలీ హైవే దాటుతూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కోటమంజూరు మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన దోనాద్రి జోగిరాజు (46) కూలీ పనులు చేసుకునేందుకు భార్యా, కుమారుడితో కలిసి కొద్దినెలల కిందట గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, పార్వతీపురం గ్రామానికి వలస వచ్చాడు. అదే గ్రామ పరిధిలోని పదహారవ నంబరు జాతీయ రహదారి వెంబడి ఉన్న జై హనుమాన్ ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సోమవారం జోగిరాజు పెరుగు ప్యాకెట్ తీసుకువచ్చేందుకు కంపెనీ నుంచి బోయపాలెం వెళ్ళాడు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని డైట్ కళాశాల ఎదురు రోడ్ దాటుతుండగా గుర్తు తెలియని వాహనం జోగిరాజును ఢీ కొట్టింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

షుగర్ వ్యాధితో ఏడవ తరగతి విద్యార్థిని మృతి


సునీతారాణి (ఫైల్)

పెదకాకాని: మధుమేహ వ్యాధి ఓ చిన్నారి ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటన మండలంలోని వెనిగండ్లలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొల్లికొండ సుబ్బారావు, తిరుపతమ్మ దంపతుల కుమార్తె శివనాగమల్లేశ్వరి భర్త ఆదినారాయణ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పుట్టింటి వద్దే ఉంటోంది. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. ఆఖరి కూతురు సునీతారాణి వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఎనిమిదేళ్ల వయస్సులో పాప అనారోగ్యం బారిన పడటంతో.. వైద్య పరీక్షలు చేయించారు. పరీక్షల్లో బాలికకు షుగర్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అప్పటి నుంచి షుగర్‌కు మందులు వాడుతున్నారు. సునీతా రాణి ఆరోగ్య రీత్యా కుటుంబ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోమవారం పాపకు నీరసంగా ఉండటంతో వైద్యం కోసం గుంటూరులోని ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో.. మంగళవారం సునీతారాణి (13) మరణించింది. ఈనెల 19న పాప పుట్టినరోజు కావడంతో.. గుర్తు చేసుకుని మరీ తల్లి శివనాగ మల్లేశ్వరి రోదిస్తోంది. బాలిక మృతదేహాన్ని ఆమె తండ్రి స్వగ్రామమైన చేబ్రోలు మండలంలోని గుండవరానికి తీసుకెళ్లారు.